క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



నివాళులర్పిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు: మండల పరిధిలోని పరమేశ్వరమంగళం ఎన్టీఆర్ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రమేష్ భార్య అమ్ములు శనివారం ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి వారి ఇంటికి వెళ్లి అమ్ములు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మృతుని కుటుంబానికి రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం



ఆలయ ఆవరణలో అన్నదానం చేస్తున్న దాతలు

కార్వేటినగరం: కార్వేటినగరం ప్రసిద్ధి రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో పుత్తూరులోని లక్ష్మీనగర్ కాలనీకి చెందిన దాతలు ఎం.రామ్మూర్తి కుటుంబ సభ్యులు శనివారం శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ మాట్లాడుతూ దాతలు ప్రతి వారం ముందుకొచ్చి పేదలకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. ఇలా ప్రతి భక్తుడు ముందుకు వచ్చి వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రతి శుక్రవారం, శనివారంలోనే కాకుండా దాతల ఇష్టానుసారం రోజూ నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో పాలు పంచుకుని తమ దాతృత్వాన్ని చాటుకోవాలని కోరారు. కార్యక్రమంలో దాత రామ్మూర్తి కుటుంబ సభ్యులు, టీటీడీ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

అనుమతి తప్పనిసరి

శ్రీరంగరాజపురం : ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉన్న కారణంగా గంగజాతర, ఊరేగింపు వంటి కార్యక్రమాల నిర్వహణకు ముందస్తుగా జిల్లా కలెక్టర్, గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి వెంకటశివ ఆదేశాల మేరకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని తహసీల్దార్ ఆల్‌ఫ్రెడ్ అన్నారు. ఈ సందరర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తు అనుమతి లేకుండా నిర్వాహక కమిటీలు ఎటువంటి చాటింపు, ప్రచారాలు కానీ చేయరాదని సూచించారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాజకీయ పార్టీలు, గ్రామ ప్రజలు, ఆలయ నిర్వహణ కమిటీలు ఎన్నికల నియమాలను పాటించి, సహకరించాలన్నారు.

ఓటు నమోదుకు నేడే చివరి రోజు

ఎన్నికల అధికారి ఆర్డీఓ వెంకటరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరెడ్డి

నగరి : 18 ఏళ్లు దాటిన యువతీ యువకులకు ఓటు నమోదుకు ఆదివారం ఒక్కరోజు మాత్రమే అవకాశం ఉందని ఆపై కొత్త ఓటర్ల నమోదు చేయడం జరగదని ఎన్నికల అధికారి అయిన ఆర్డీఓ వెంకటరెడ్డి అన్నారు. శనివారం ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన అన్ని పార్టీల నేతలు, అధికారుల సమావేశంలో ఆర్డీఓ మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున అన్ని పార్టీల వారు అనుమతులు లేకుండా ఏ కార్యక్రమాలు చేపట్టరాదన్నారు. ప్రతి ఖర్చును లెక్కించడానికి అధికారులను నియమించడం జరిగిందన్నారు. ఓటర్ల తొలగింపునకు, సవరణలకు గడువు ముగిసిందని ఇక అభ్యర్థనలు చేసుకున్నా స్వీకరించడం జరగదన్నారు. అలాగే కొత్త ఓటు నమోదుకు కూడా ఆదివారం చివరి తేదీ అన్నారు. ప్రశాంత వాతావరణంలో స్వార్వత్రిక ఎన్నికలు జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అఖిలపక్ష నేతలు, అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భావనారుషి కల్యాణం

నారాయణవనం: వార్షిక ఉత్సవాలలో భాగంగా మండలంలోని పాలమంగళం ఉత్తరపుకండ్రిగలో శనివారం భద్రకాళీ సమేత భావనారుషి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తీర్థ ప్రసాదాలతోపాటు అన్నప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. రాత్రి స్వామి వ్యాఘ్ర(పులి) వాహనంపై గ్రామ వీధుల్లో విహరించారు. రుత్వికులు 11 గంటలకు భద్రకాళీ అమ్మవారితో భావనారుషి కల్యాణాన్ని నిర్వహించారు. దంపతులు, మహిళలు అక్షింతలు, ప్రసాదాలను అందుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఉత్సవ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

జగనన్న పాలన సంక్షేమానికి చిరునామా

- మీ ఇంటి బిడ్డగా ఆశీర్వదించండి
- పేదలకు, పెత్తందారులకు మధ్య ఎన్నికలు
- గంగాధర నెల్లూరు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి
- అడుగడుగునా పూలవర్షాలు కురిపించి, డప్పు వాయిద్యాలతో బ్రహ్మరథం పడుతున్న ప్రజలు
- జగనన్న పాటలకు ఉత్సాహంగా డాన్స్ చేసిన నాయకులు మహిళలు, కార్యకర్తలు



కృపాలక్ష్మికి గజమాలతో స్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

గంగాధరనెల్లూరు: పేదల గుండెల్లో గూడు కట్టుకున్న ఏకైక వ్యక్తి సీఎం జగన్ అని గంగాధరనెల్లూరు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి అన్నారు. గంగాధరనెల్లూరు మండలంలోని కొండేపల్లి, వీరక నెల్లూరు పంచాయతీల్లోని గ్రామాల ప్రజలు అడుగడుగునా హారతులు పట్టి గజమాలతో నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మికి భారీ స్వాగతం పలికారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయండి..

నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి రాక సందర్భంగా గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు పూలవర్షం కురిపించి, బాణసంచా, డప్పు వాయిద్యాలతో గ్రామాల్లోని మహిళలతో హారతులతో భారీ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి వీరకనెల్లూరు కోదండన్ మాట్లాడుతూ రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే సీఎం జగనన్న లక్ష్యమన్నారు. అనుక్షణం పేదల కోసం పరితపిస్తున్న ఏకైక వ్యక్తి సీఎం జగన్ అన్నారు. చంద్రబాబు ఎస్సీలను మోసం చేసి వెన్నుపోటు పొడుస్తున్నారని, ఎస్సీలంటే చంద్రబాబుకు చులకనని, కల్లబొల్లి మాటలు చెప్పి కుట్రలు చేయడానికి మళ్లీ తయారయ్యారని, దుష్టచతుష్టయంతో, కుట్రదారులతో కూటమిగా ఏర్పడి సంక్షేమ ప్రభుత్వానికి అడ్డు వస్తున్నారని ధ్వజమెత్తారు. ఎవరెన్ని చేసినా కపట నాటకాలు ఆడిన ప్రజలంతా జగన్ వైపే ఉన్నారన్నారు.



ప్రచారంలో మాట్లాడుతున్న కృపాలక్ష్మి

మహిళా పక్షపాతి సీఎం జగనన్న..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి మాట్లాడుతూ మహిళా పక్షపాతి జగనన్న అని, అన్ని రంగాల్లో మహిళలు ముందుండాలన్నదే జగనన్న ధ్యేయం అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ ప్రభుత్వం కావాలంటే రానున్న ఎన్నికల్లో జగనన్నను మరోసారి సీఎం చేసుకుందామని తెలిపారు. సర్వతోముఖాభివృద్ధి ప్రజా సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పేద ప్రజల ప్రగతిని చిత్తశుద్ధితో పనిచేస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనన్నారు. నియోజకవర్గంలో తన తండ్రి డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఎంతో అభివృద్ధి చేశారని, అదే బాటలో నడుస్తూ ప్రజాసేవకు అంకితం అవుతా అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అనిత, జెడ్పీటీసీ లక్ష్మీప్రియ, మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, రాష్ట్ర గ్రీనింగ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వేల్కూరు బాబురెడ్డి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, నాయకులు ముని రాజారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ చిన్నమ రెడ్డి, వీరకనెల్లూరు సర్పంచ్ అమరావతి, కొండేపల్లి సర్పంచ్ గోవిందస్వామి, ఎంపీటీసీ ఇందిర, కేశవ రెడ్డి, ఉప సర్పంచ్ వెంకటేశులు, గోవిందశెట్టి, ప్రవీణ్, లోకేష్, రమేష్ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

18 నుంచి మహాభారత యజ్ఞం



ఉత్సవాలకు సిద్ధమవుతున్న ఆలయం

వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్యపల్లె పంచాయతీ మొరవ గ్రామంలో ఉన్న శ్రీకృష్ణ ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో ఈనెల 18 నుంచి మహా భారత ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మోహన్‌రెడ్డి, తారక్ రెడ్డి శనివారం తెలిపారు. 15వ ఏటా జరిగే ఈ వార్షిక ఉత్సవాలను 10 రోజుల పాటు జరుపనున్నట్లు చెప్పారు. 18న గురువారం ధ్వజారోహణం, 19న యజ్ఞం పూజలు, 20న యజ్ఞం ప్రత్యేక పూజలు, 21న బండికుంభాలు, 22న సోమవారం ద్రౌపదీ దేవి కల్యాణం, 23న మంగళవారం ద్రౌపదీ మానసంరక్షణ, 24న బుధవారం అర్జున తపస్సు, 25 గురువారం యజ్ఞం పూజ, 26న శుక్రవారం ఉత్తరగోగ్రహణం, 27న శనివారం ఇలావంతుని వధ, 28న ఆదివారం దుర్యోధన వధ, సాయంత్రం ధర్మరాజుల పట్టాభిషేకం కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగుల కోడ్ ఉల్లంఘన



సమావేశంలో పాల్గొన్న ఆర్టీసీ ఉద్యోగులు



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకుడు

- నాలుగు డిపోల ఉద్యోగులతో సమావేశం
- మహిళా అధికారులపై అనుచిత వ్యాఖ్యలు
- ఆర్‌ఎంకు రిపోర్ట్ చేసిన పుత్తూరు డిపో మేనేజర్
- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఆర్టీసీ సీఐ

పుత్తూరు(తిరుపతి జిల్లా): ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవనే ఎలక్షన్ కమిషన్ ఆదేశాలను ఆర్టీసీ ఉద్యోగులు బేఖాతరు చేశారు. కేంద్ర ఎన్నికల కమిషన్ మార్చి 16న ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసిన సంగతి విదితమే. అదే రోజు నుంచి జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ ఉంటుందని అధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అయినా ఎన్నికల కోడ్‌ను యధేచ్ఛగా ఉల్లంఘిస్తూ ఈనెల 1న స్థానిక వాకర్స్ అసోసియేషన్ భవనంలో పుత్తూరు ఆర్టీసీ డిపోతో పాటు తిరుమల, మంగళం, సత్యవేడు డిపోలకు చెందిన ఒకే యూనియన్‌కు చెందిన సుమారు వందమంది ఉద్యోగులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విధానాలను విమర్శిస్తూ ప్రసంగాలు చేశారు. అంతే కాకుండా పుత్తూరు డిపోకు చెందిన మహిళా అధికారులపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీనిపై స్థానిక ఆర్టీసీ సీఐ మంగమ్మ పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారు. ఎన్నికల కోడ్ సమయంలో సమావేశం నిర్వహించి, ఇతర యూనియన్ల వారిని ఎలా దూషిస్తారంటూ సదరు యూనియన్ నాయకులు ఆర్టీసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడమే కాకుండా, దూషణలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయాలపై పుత్తూరు ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రశాంతి తిరుపతి ఆర్‌ఎంకు రిపోర్ట్ చేశారు. దీనిపై స్పందించిన ఆర్‌ఎం విచారణకు ఆదేశించినట్లు సమాచారం. నేటి ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలోకి విలీనం చేసిన విషయాన్నే విస్మరించిన యూనియన్ నాయకులు ఇంకా తాము కార్పొరేషన్ ఉద్యోగులుగానే భావిస్తున్నారని, ఇతర యూనియన్ నాయకులు విమర్శించడం గమనార్హం.


సంక్షేమ పాలనకు చిహ్నం 'ఫ్యాన్'



ప్రచారం చేస్తున్న రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌కే సెల్వమణి

నగరి : సంక్షేమ పాలనకు చిహ్నం 'ఫ్యాన్' అని మంత్రి ఆర్కేరోజా భర్త, రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని 4, 5 వార్డుల్లో ఆయన నేను సిద్ధం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులో ఆయనకు అపూర్వ స్వాగతం లభించింది. ప్రతి ఇంటికి వెళ్లి అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలను, రోజా ఛారిటబుల్ ట్రస్టుద్వారా మంత్రి చేసిన సేవలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలపై తక్షణం స్పందించే పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రమే అన్నారు. ప్రజల పక్షాన నిలబడి పని చేస్తోందన్నారు. వార్డులో ప్రతి ఇంటికీ అందిన సంక్షేమమే ఇందుకు నిదర్శనమన్నారు. ఎలాగైనా ఎన్నికల్లో గెలిచిపోవాలని ప్రతిపక్ష పార్టీ టీడీపీ పడే పాట్లను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. అలివికాని హామీలు ఇచ్చి ఎలాగైనా గెలిచిపోవాలని ఆపై ప్రజలకు పంగనామం పెట్టాలన్నదే ఆ పార్టీనేతల తీరన్నారు. నమ్మి మోసపోతే ఐదేళ్లపాటు కష్టాలు అనుభవించక తప్పదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వార్డు కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, దయానిధి, మునికృష్ణారెడ్డి, ఇంద్రయ్య, నాయకులు ఆరుముగం, బాబు, టీకే హరి, సురేష్, కుమార్, వేణిరోస్, తేన్‌మొళి, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థి ఖర్చు రూ.40 లక్షలకు మించకూడదు



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివ

గంగాధరనెల్లూరు: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసే వ్యక్తి రూ.40 లక్షలకు మించి ఖర్చు చేయరాదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివ తెలిపారు. గంగాధరనెల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో శనివారం వివిధ రాజకీయ పార్టీ నేతలతో ఎన్నికల నియమ నిబంధనలు గురించి ఆర్‌ఓ వెంకట శివ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ ఫారాల్లో వివరాలు నింపేముందు ఒకటికి రెండుసార్లు ఆ విషయాలు పూర్తిగా చదివి తర్వాత ఫారంలోని ఖాళీలను నింపాలని కోరారు. తమిళనాడు సరిహద్దులో ఈ నియోజకవర్గం ఉన్నందున ఇక్కడ ప్రజలు వైద్య పరంగా వేలూరులోని ఆస్పత్రులకు వెళ్తుంటారని, అలాంటివారు అత్యవసర పరిస్థితుల్లో డబ్బులు తీసుకెళ్తుంటే ఎన్నికల టీం అధికారులు వారిని ఇబ్బంది పెట్టకుండా పంపించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవి, వివిధ రాజకీయ పార్టీకి చెందిన నేతలు పాల్గొన్నారు.

తొలిసారే ప్రభంజనం



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో హెచ్‌ఎం గాయత్రీదేవి, ఉపాధ్యాయులు

కార్వేటినగరం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఈసారి కొత్తగా ఇంటర్ విద్యను ప్రారంభించారు. శుక్రవారం వెలువడిన ఇంటర్ ఫలితాల్లో తొలి ఏడాదే మండల స్థాయిలో విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని పాఠశాల హెచ్‌ఎం గాయత్రీదేవి అన్నారు. శనివారం కళాశాలలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు, ఉపాధ్యాయులు అభినందించి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం ఈసారే ఇంటర్ కళాశాల ఏర్పాటు చేసిందన్నారు. మొదటిసారి ఫలితాల్లోనే మండల స్థాయిలో ప్రభంజనం సృష్టించి జిల్లాస్థాయిలో మూడో స్థానంలో నిలవడం గర్వంగా ఉందన్నారు. విద్యార్థిని మధుర మీనాక్షి(బైపీసీ) 440 మార్కులకు 403 మార్కులు సాధించి మండలంలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. మరో విద్యార్థిని మీనా 440కి గాను 389 మార్కులు సాధించి ద్వితీయస్థానంలో నిలిచినట్లు చెప్పారు. అలాగే రోహిత్(సీఈసీలో) 500 గానూ 413 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచాడని తెలిపారు. ఇంటర్ ఫలితాల్లో విద్యార్థులు మండల స్థాయిలోనే కాకుండా జిల్లాలో మూడో స్థానంలో నిలిచేలా బోధనలు చేసిన ఉపాధ్యాయులను, మంచి మార్కులతో ఉత్తీర్ణ సాధించిన విద్యార్థులను హెచ్‌ఎం పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి



సేంద్రియ ఎరువులు వేసిన పంటను పరిశీలిస్తున్న వాసు

పాలసముద్రం : ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పంటలకు రైతులు సేంద్రియ ఎరువులు వాడడం ద్వారా పంటలు అధిక దిగుబడి వస్తాయని డీపీఎం వాసు తెలిపారు. శనివారం కృష్ణజమ్మపురంలో రైతులు ప్రకృతి వ్యవసాయంలో సేంద్రియ ఎరువులు వేసి సాగుచేసిన పంటలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడుతూ వేరుశనగ పంట సాగుపై వివరించారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో వరి సాగు చేసి, తద్వారా వచ్చిన బియ్యాన్ని తినడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కిచెన్ గార్డెన్ మోడల్ విత్తనాల కిట్స్ గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ పుష్ప, రైతులు షణ్ముగరెడ్డి, ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ ఏర్పాట్ల పరిశీలన



ఎగువగూకూరు పోలింగ్ బూత్‌లో సూచనలు చేస్తున్న ఆర్‌ఓ వెంకటరెడ్డి

పుత్తూరు: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని నగరి ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్, ఆర్డీఓ కె.వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం పుత్తూరు రూరల్ మండల పరిధిలోని 23 పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ బూత్‌ల వద్ద మౌలిక వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, స్థానిక అధికారులకు తగిన సూచనలు చేశారు. ఎన్నికల సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా, సజావుగా పోలింగ్ జరిగేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.శ్రీనివాసగౌడ్, ఎంపీడీఓ పి.ప్రసాద్, సెక్టోరల్ ఆఫీసర్స్, సూపర్‌వైజర్స్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

పిల్లలకు సకాలంలో టీకాలు వేయాలి



ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పాలసముద్రం : ఐదేళ్లలోపు పిల్లలకు, గర్భిణులకు సకాలంలో టీకాలు వేయాలని ఎంపీడీఓ రామనాథరెడ్డి, డాక్టర్ మోహన్‌కృష్ణ తెలిపారు. శనివారం సింహరాజుపురంలో జరుగుతున్న 104 వాహన వైద్య సేవలను ఎంపీడీఓ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నారులకు టీకాలను సక్రమంగా వేయాలని తెలిపారు. బిడ్డకు, బిడ్డకు మధ్య మూడేళ్లు అంతరం పాటించాలన్నారు. ఇది తల్లీబిడ్డల ఆరోగ్యానికి మంచిదన్నారు. ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో గర్భిణులు ఎక్కువగా పండ్ల రసం, మజ్జిగ తీసుకోవాలని సూచించారు. ఆశా కార్యకర్తలు ఓఆర్ఎస్ ప్యాకెట్లను ప్రజలకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ భాస్కర్ రెడ్డి విస్తరనాధికారి రమేష్, ఏఎన్‌ఎం రేవతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలోనే అభివృద్ధి

- సంక్షేమం కావాలంటే మరోసారి జగనన్నను గెలిపించుకుందాం
- నింద్రలో విస్తృతంగా వైఎస్సార్‌సీపీ నేతల ప్రచారం



కేఆర్‌పాళెంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నింద్ర: రాష్ట్రంలో ప్రస్తుతం సంక్షేమ పథకాలు అమలు కావాలంటే మరోమారు వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాలని ఆ పార్టీ నాయకులు ప్రజలను అభ్యర్థించారు. శనివారం మండలంలోని కేఆర్‌పాళెం పంచాయతీలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి శ్యామ్‌లాల్, ఎంపీపీ దీప ఆధ్వర్యంలో మేము సిద్ధం–మా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత జగనన్నదే అన్నారు. రాష్ట్రంలో ఆ పథకాలన్నీ అందాలంటే తిరిగి మనం జగనన్నను మరోసారి సీఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని విద్యార్థుల నుంచి వృద్ధుల వరకు సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత జగనన్నదేనని అన్నారు. నగరి నియోజకవర్గంలో సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే అంతా కలిసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శుభ, పార్టీ మండల కన్వీనర్ వేణురాజు, ఎంపీటీసీ సభ్యులు విజేష్, కోఆప్షన్ సభ్యులు అనిల్, మండల సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి, ఎస్సీసెల్ అధ్యక్షుడు దామోదరం, సర్పంచ్ గౌరి, నాయకులు వీరయ్య, శేఖర్, సింగారం, వెంకటేశులు, పురుషోత్తం, మాజీ ఎంపీటీసీ వసంతమ్మ, త్యాగరాజ్, దిలీప్, కన్నయ్య, మహేష్, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

కె.పురుషోత్తం, జి.రాజారెడ్డి, కె.మురళీరెడ్డి, ఎల్.భాస్కర్‌రావు

పుత్తూరు: పట్టణానికి చెందిన నూతన బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా కె.పురుషోత్తం, వైస్ ప్రెసిడెంట్‌గా జి.రాజారెడ్డి, జనరల్ సెక్రెటరీగా కె.మురళిరెడ్డి, జాయింట్ సెక్రెటరీగా ఎల్.భాస్కర్ రావ్, ట్రెజరర్‌గా పి.దిలీప్‌రెడ్డి, లైబ్రెరిన్ టి.సారథి, లేడీస్ రెప్రెంజెంటేటివ్ జి.ఏ.సూర్యను ఎన్నుకున్నారు.

ధ్యానంతో వాస్తవ సాక్షాత్కారం



సమావేశంలో మాట్లాడుతున్న కేశవరాజు

పుత్తూరు: ధ్యాన క్రమంలో మన మనస్సును దేని మీదైతే కేంద్రీకృతం చేస్తామో అది మన కళ్ల ముందు సాక్షాత్కరిస్తుందని ధ్యాన జగత్ మాస పత్రిక పబ్లిషర్స్, ధ్యానరత్న డి.కేశవరాజు తెలిపారు. శనివారం స్థానిక విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘ సమావేశం అధ్యక్షుడు బి.భాస్కర్‌రాజు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన కేశవరాజు మాట్లాడుతూ పిరమిడ్ ధ్యాన విశిష్టతను వివరించారు. అనంతరం బ్రహ్మర్షి పితామహ పత్రీజీ చిత్ర మెమెంటోలను పంపిణీ చేశారు. సమావేశంలో స్కూల్ అసిస్టెంట్ పుష్పావతి భర్త జ్ఞాపకార్థం సంఘ భవన అభివృద్ధి పనులకు రూ.50 వేలు విరాళాన్ని భాస్కర్‌రాజుకు అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు యుగంధర్‌రాజు, గుణశేఖర్ రెడ్డి, బాలసుబ్రమణ్యం, పురుషోత్తమశెట్టి, రవిశంకర్, సుబ్రమణ్యం, రామలింగం, రామ్మూర్తిరాజు, చంద్రశేఖర్‌వర్మ, అరుణాచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన



ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఉపాధి సిబ్బంది

శ్రీరంగరాజపురం : ఉపాధిహామీ పనులను ఏపీఓ చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేసి మస్టర్ రికార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి వందరోజులు పని దినాలు కల్పించాలని, కూలీల సంఖ్యను పెంచి, వారి హాజరును ఆన్‌లైన్‌లో పొందుపరచాలని అన్నారు. ప్రతి కూలికి ఒక పనిదినానికి గరిష్ఠంగా రూ.300 కేటాయించడం జరిగిందన్నారు. కూలీల హాజరులో ఏవైనా అవకతవకలు చేసినట్లయితే సంబంధిత అధికారిని విధుల నుంచి తొలగించడం జరుగుతుందన్నారు. అనంతరం మండలంలోని కటికపల్లి, 49 కొత్తపల్లిమిట్ట గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ ఫారం, కాలువ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీఏ నౌషాద్, రేఖ, బాల, రామ్మూర్తి, నోమేశ్వరి, ఫీల్డ్ అసిస్టెంట్ ఆనందయ్య, జ్యోతి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మహాభారత ఉత్సవాల్లో ఇరువర్గాల ఘర్షణ



కొత్తపల్లిమిట్ట దళితవాడలో గ్రామస్తులతో చర్చిస్తున్న డీఎస్పీ కేఎస్ మూర్తి

శ్రీరంగరాజపురం: మండలంలోని 49 కొత్తపల్లిలో శుక్రవారం రాత్రి మహాభారత ఉత్సవాల్లో ఇరువర్గాల వారు ఘర్షణ పడ్డారు. ఎస్ఐ రాజకుల్లాయప్ప కథనం మేరకు.. 49 కొత్తపల్లి గ్రామం వద్ద జరుగుతున్న మహాభారత ఉత్సవాలకు కొత్తపల్లి మిట్ట దళితవాడకు చెందిన ధనుష్ వెళ్లాడు. అక్కడున్న కుర్చీలో కూర్చున్నాడు. కొత్తపల్లి గ్రామానికి చెందిన హర్షవర్ధన్‌రెడ్డి, సూరిరెడ్డి, నవీన్‌రెడ్డి, మునికన్నారెడ్డి, సుదర్శన్‌రెడ్డి ఆగ్రహంతో ఊగిపోయారు. తమ ముందే కుర్చీలో కూర్చుంటావా అంటూ కులం పేరుతో దూషించడంతోపాటు దాడి చేశారు. దీంతో అవమానాకి గురైన ధనుష్ ఈ విషయాన్ని కొత్తపల్లి దళితవాడ యువకులకు చెప్పాడు. వారు గుంపుగా వచ్చి ధనుష్‌పై దాడి చేసిన వారితో ఘర్షణకు దిగారు. ఇరువర్గాల వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దళితులపై దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే అగ్రవర్ణాలపై దాడి చేసిన ధనుష్, శ్యామ్, మహేష్‌పై డొమ్మీ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నగరి డీఎస్పీ కేఎస్ మూర్తి, కార్వేటినగరం సీఐ సత్యబాబు శనివారం రాత్రి గ్రామంలో విచారణ చేపట్టారు.